

## వన మహోత్సవం విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

5లో

Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 160
సంచిక : 275
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

మంగళవారం, జూన్ 16, 2026

# అనధికారిక డంపింగ్ యార్డ్

## పొంచి ఉన్న వ్యాధుల ముప్పు



**టి మీడియా ,జూన్ 15, జూలూరుపాడు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారి పక్కన ఇప్పుడు చెత్తా చెదారానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. జూలూరుపాడు మండల కేంద్రంలోని వెంగన్నపాలెం ప్రధాన రహదారి పక్కన, ఏకంగా పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలను తలపిస్తూ అనధికారిక డంపింగ్ యార్డ్‌గా మారాయి. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపం, కొందరు వ్యాపారుల నిర్లక్ష్యం వెరసి స్థానికులకు, ప్రయాణికులకు తీవ్ర అవస్థలు తెచ్చిపెడుతున్నాయి.

**రాత్రి వేళల్లో వ్యర్థాల డంపింగ్**

గతంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న పొలానికి చెందిన రైతులు మట్టి కోసం తీసిన భారీ గుంత ఇప్పుడు స్థానిక వ్యాపారులకు వ్యర్థాలు పారబోసే అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో కొందరు వ్యాపారులు, హోటల్ యజమానులు, కొబ్బరి బొండాలు విక్రయించేవారు, జ్యూస్ పాయింట్ల నిర్వాహకులు తడి, పొడి చెత్తను ప్లాస్టిక్ కవర్లలో తీసుకొచ్చి ఇష్టారాజ్యంగా ఇక్కడ పారబోస్తున్నారు. ఈ తడి చెత్త, ఇతర వ్యర్థాలు మురిగిపోయి ఆ దారిన వెళ్లే ప్రయాణికులకు ముక్కుపుటలదిరే దుర్గంధం వెదజల్లుతోంది. ఈ ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటేనే ప్రజలు ముక్కు మూసుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది.

**హరితహారం చెట్ల మధ్య చెత్తాచెదారం**

గత ప్రభుత్వ పాలనలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'హరితహారం' కార్యక్రమంలో భాగంగా రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి పెద్ద వృక్షాలుగా మారాయి. కానీ ఆ చెట్ల మధ్య ఉన్న పచ్చని ఆహ్లాదకరమైన స్థలాలు ఇప్పుడు కొబ్బరి బోండాలు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలకు నిలయంగా మారాయి. పోలీస్ స్టేషన్ సమీపంలోని డివైడర్ నుండి మొదలుకుని సాయిబాబా దేవాలయం వరకు రహదారికి ఇరువైపులా ఎటు చూసినా ఈ చెత్తాచెదారమే దర్శనమిస్తుండడం గమనార్హం.

**పొంచి ఉన్న వ్యాధుల ముప్పు**

ఒకవైపు వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఈ చెత్తాచెదారం స్థానికులకు మరింత ప్రాణ సంకటంగా మారనుంది. పారిశుధ్యం పూర్తిగా లోపించడంతో ఈ ప్రాంతమంతా ఇప్పటికే దోమల స్వైర విహారానికి అడ్డాగా మారింది. దీనికి తోడు వానలు కురిస్తే పరిస్థితి మరింత దయనీయంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రోడ్డుకు ఇరువైపులా చెట్ల మధ్య విచ్చలవిడిగా పారబోసిన కొబ్బరి బోండాల్లో వర్షపు నీరు చేరి నిల్వ ఉంటే అవి డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులను వ్యాప్తి చేసే దోమలకు ప్రధాన ఆవాసాలుగా మారుతున్నాయి. మురుగు నీరు, తడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన ఈ ప్రాంతం వల్ల ప్రయాణికుల తోపాటు ఇటు స్థానిక ప్రజలకు అంటువ్యాధుల ముప్పు తీవ్రంగా పొంచి ఉంది.

**ప్లాస్టిక్ తింటూ మృత్యుఒడికి చేరువవుతున్న గోవులు**

ఈ చెత్త గుట్టలు కేవలం పర్యావరణానికి, ప్రజారోగ్యానికే కాకుండా మూగజీవాలకు కూడా ప్రాణాంతకంగా పరిణమించాయి. రహదారి పక్కన సంచరించే గోవులు, ఇతర పశువులు ఆకలి తీర్చుకునే క్రమంలో ఈ

3లో



## ఉపాధి పనుల్లో కార్మికుల సమీకరణ పెంచాలి

### కలెక్టర్ దివాకర టీఎస్

**టి మీడియా ,జూన్ 15, ఖమ్మం:**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు, గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే సాగునీటి వనరుల అభివృద్ధి పనులను ప్రాధాన్యతగా చేపట్టి, మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు.సోమవారం వైరా నియోజకవర్గ పరిధిలో పర్యటించిన జిల్లా కలెక్టర్, వైరా మండలం సొన్నాల లక్ష్మీపురం గ్రామంతో పాటు కొనిజర్ల మండల కేంద్రంలో కొనసాగుతున్న కేనాల్ లింక్ కాలువ పూడికతీత పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్ కార్మికులతో మాట్లాడారు. వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు గ్రామీణ ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి దోహదపడేలా ఉండాలని అన్నారు. కాలువల పూడికతీత, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు, రైతులకు సాగునీరు అందించే మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు.ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనుల లభ్యతను పెంచి, ఎక్కువ మంది కార్మికులకు పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చూడాలని, కూలీల హాజరు నమోదును పారదర్శకంగా నిర్వహించాలని, మాస్టర్ రోల్స్‌లో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.ఉపాధి హామీ పనుల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని, పనుల నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి పనిని ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా ఫోటో క్యాప్చరింగ్ చేసి నమోదు చేయాలని, జియో ట్యాగింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించు కోవాలని కలెక్టర్ అన్నారు. పనుల ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకొని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు.ప్రస్తుతం కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కూలీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పని స్థలాల్లో షేడ్ నెట్లు ఏర్పాటు చేసి తగిన నీడ కల్పించడంతో పాటు, త్రాగునీరు,

5లో



# ప్రజలకు సత్వర సేవలందించడమే లక్ష్యం

### -జిల్లా కలెక్టర్ అంకిత్

**టి మీడియా ,జూన్ 15, భద్రాద్రి కొత్తగూడెం :**ఐ డి ఓ సి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్ఓ పద్మావతితో కలిసి ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, రెవెన్యూ మరియు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల సమస్యలను కేవలం నమోదు చేయడం కాకుండా, వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు.శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. వెంటనే పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు చేపట్టాలని



కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అన్నారు .ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడం లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.

5లో

# ‘సింగరేణి కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉండాలి’

**టి మీడియా ,జూన్ 15, రుద్రంపూర్ :** సింగరేణిలో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సంస్థ వ్యాప్తంగా సమ్మె తప్పదని, జూన్ 22 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం పీవీకే-5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికుల సహనాన్ని యాజమాన్యం బలహీనతగా భావించవద్దని హెచ్చరించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులు, అలియాస్ పేర్ల మార్పులు, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ తొలగింపు, సొంత ఇంటి స్థలాల కేటాయింపు, డిపెండెంట్ ఉద్యోగాల వంటి సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మిక సంక్షేమం, సంస్థ అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు నియామక ఉత్తర్వులు జారీ కావడం ఏఐటీయూసీ పోరాట ఫలితమేనని పేర్కొన్న ఆయన, కార్మికులు ఐక్యంగా పోరాడితే మరిన్ని సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కొత్త కోల్ బ్లాకుల కేటాయింపు, కొత్త గనుల ప్రారంభం, సంస్థ విస్తరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్‌తో జరిగిన సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్ల అమలు కాకపోవడం వెనుక రాజకీయ జోక్యమే కారణమని ఆరోపించిన రంగయ్య, సమస్యలు పరిష్కరించకపోతే సింగరేణిని స్తంభింపజేసే స్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మిక హక్కులు, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్ పరిరక్షణ కోసం జరిగే పోరాటానికి అన్ని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్



రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, వైస్ ప్రెసిడెంట్లు కత్తెర్ల రాములు, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బేరర్లు సందబోయిన శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, హుమాయూన్, పిట్ కార్యదర్శులు మధుకృష్ణ, కమల్, సీనియర్ నాయకులు మండల రాజేశ్వరరావు, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సందీప్, మైనింగ్ స్టాప్ ఇన్‌చార్జి సాయి పవన్, సేఫ్టీ కమిటీ మెంబర్ రాంచందర్, నారాయణ, లాల్ సింగ్, కుమార్ రావు, సంజీవ్,మోహన్, సురేందర్ రెడ్డి, కనకయ్య, మహేశ్, ముబారక్, గణేష్, సునీల్, నరేశ్, విక్రమ్, సహదేవ్, సుదీర్, బాబురావు, మదనయ్య, కోటేశ్వరరావు, పాల్గొన్నారు.



## రైతాంగాన్ని కాపాడాలి

**మార్కెట్ కార్యవర్గంతో అఖిలపక్షాల రైతు సంఘం**

**టీ మీడియా ,జూన్ 15, ఖమ్మం :**అఖిలపక్షాల రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం మార్కెట్ కార్యవర్గంతో రైతు సమస్యల మీద వచ్చిన సరుకుల్ని సరైన ధరలు అందించాలని రైతాంగాన్ని కాపాడాలని గత మార్కెట్ పాలకవర్గంలో ఉన్న గన్నిసంచి కి మార్కెట్ వ్యాపారస్తులు 25 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని బయట మార్కెట్లో 85 రూపాయల దాకా అమ్ముతున్నార,ని రైతు సరుగుతోపాటు గన్ని సంచి విషయంలో నష్టపోతున్నారని పాలకవర్గంతో అఖిలపక్ష రైతు సంఘాలు చర్చలు జరిపి సుమారు 70 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ పెట్టగా పాలకవర్గం ఛాంబర్ వ్యాపారస్తులు తో మాట్లాడిన తర్వాత పలు దఫాలుగా చర్చలు జరిపి రైతు నష్టపోకుండా 40 రూపాయలు ఇస్తామని మార్కెట్ అధ్యక్షులు ప్రకటించడం జరిగింది . ఈ ప్రకటనను వ్యాపారవర్గాలు రైతు సంఘాలతో చర్చలు జరిపి ఫైనల్ గా నలభై రూపాయలను రైతులు గమనించాలని మార్కెట్ కార్యదర్శి ,పాలకవర్గం నిర్ణయించింది పెరిగిన ధరకు అనుగుణంగా సరుకు తీసుకొచ్చిన ప్రతి రైతుకు గన్నేసంచికి 40 రూపాయలు ఇవ్వాలని వ్యాపారాలు వర్గాలను ఆదేశించడం అయినది పెంచిన ధరను అఖిలపక్ష రైతు సంఘం పోరాడి సాధించుకున్న ధరను వెంటనే అమలు చేయాలని డిమాండ్ ని పాలకవర్గానికి చెప్పటం జరిగింది దీని పాలకవర్గం వెంటనే అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.



## మల్లారం కాలనీకి మౌలిక వసతులు ఎప్పుడూ?..

**ప్రజల పక్షాన ఉంటాం: సిపిఐఎంఎల్**

**టీ మీడియా ,జూన్ 15, దమ్మపేట:**దమ్మపేట మండల కేంద్రంలోని మల్లారం కాలనీ ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా, ఇప్పటికీ కనీస మౌలిక వసతులు అందక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సరైన డ్రైనేజీ వ్యవస్థ మరియు కొన్ని వీధులకు సరైన సిసి రోడ్లు కూడా లేవు ఎప్పుడో గత ప్రభుత్వంలో శాంక్షన్ రోడ్లు కూడా ఇప్పటికీ రోడ్లు వేయకుండా వదిలేశారు కనీసం కొన్ని బజారులకు అయితే మనుషులు నడిచే దారి కూడా లేకుండా చిపించిగా పెరిగిన మొక్కలే అడ్డుగా ఉన్నాయి ..వాటిని శుభ్రం చేసే నాధుడే లేడు అదేవిధంగా కాలనీలో ప్రభుత్వం కేటాయించిన ఇల్లు కనీసం పునాదివేసి వదిలేసిన ఇల్లులు చాలా ఉన్నాయి వాటి మీద పెరిగిన చెత్తను కూడా శుభ్రం చేసే వాళ్ళు ఎవరూ లేరు వెంటనే ఆ చెత్తను శుభ్రం చేసి ఎవరి స్థలాలను వాళ్ళు బాగు చేసుకోవాలి. లేని పక్షంలో పార్టీ తరఫున ఆ ఇళ్ల స్థలాలను ఇల్లు లేని వారికి కేటాయిస్తామని హెచ్చరిస్తున్నాం. ..

## సమస్యల పరిష్కారం కి పోరాటాలే మార్గం.

**టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.**

**టీ మీడియా ,జూన్ 15, కూసుమంచి:**సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమని అందుకు ప్రతి ఒకరు సిద్ధంగా ఉండాలని టి పి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు ప్రభుత్వ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కూసుమంచి మండల టిపిటిఎఫ్ సబ్ కమిటీ సమావేశం మదనాచారి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో వెంగళరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలను మూసివేసే కుట్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జి మల్లయ్య కూసుమంచి మండల ప్రధాన కార్యదర్శి బద్రు మండల జిల్లా కౌన్సిలర్స్ నరసింహారావు వీరన్న శివరావు శంకర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.





## భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

**టీ మీడియా, ముదిగొండ జూన్ 15 :** ముదిగొండ మండల పరిధిలోని వల్లభి గ్రామ కచేరి సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిచ్చాల బిక్షం, బీసీ సెల్ అధ్యక్షులు కాకర్ల మాధవరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు చేకూరి రామారావు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం వల్లభి గ్రామ ప్రజల తరఫున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, నూతనంగా ఎన్నికైన మత్స్య శాఖ సొసైటీ చైర్మన్ బిచ్చాల శ్రీనివాసరావుతో పాటు బిచ్చాల బిక్షం, చేకూరి రామారావు, కాకర్ల మాధవరావులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. వార్డు మెంబర్లు గువ్వల సంగీతరావు, నాగేశ్వరరావు, పుల్ల సాహెబ్‌లను కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ బిచ్చాల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ దాసు, పిల్లుట్ల వెంకటేశ్వర్లు, మార్తా వెంకన్న, బోయినపల్లి సీతారాములు, కోటేశ్వరరావు, పిల్లుట్ల నారాయణ, కాకర్ల వెంకటేశ్వర్లు, కొండ రాంబాబు, ఏనుగుల సతీష్, కొండ వెంకన్న గౌడ్, యడపల్లి గోవిందరావు, బండి నాగేందర్ మరియు పెద్ద సంఖ్యలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చిన్నారుల భవిష్యత్తుకు భరోసా

**లక్ష రూపాయల సాయం ప్రకటించిన కాంగ్రెస్ నేత**

**టిమీడియా ,జూన్15, కురవి:** తల్లిని కోల్పోయి అనాథలైన ఇద్దరు చిన్నారులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మాలోత్ నెహ్రూ నాయక్ ఆపన్న హస్తం అందించారు. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ ఇద్దరి పేరిట చెరో రూ.50 వేల చొప్పున మొత్తం లక్ష రూపాయలు డిపాజిట్ చేస్తానని ప్రకటించి తన ఉదారతను చాటుకున్నారు.కురవి మండలం గాజా తండా గ్రామపంచాయతీ పరిధిలోని టేకులతండాకు చెందిన గూగులోత్ నరేష్ భార్య కళ్యాణి కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇటీవల ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ఆమె ఇద్దరు చంటి బిడ్డలు తల్లి లేని వారయ్యారు.విషయం తెలుసుకున్న నెహ్రూ నాయక్ గురువారం టేకులతండా గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారుల దీనస్థితిని చూసి చలించిపోయిన ఆయన, వారి చదువు, భవిష్యత్తు కోసం తక్షణ సాయంగా ఇద్దరి పేరిట రూ.50 వేల చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చారు.నెహ్రూ నాయక్ చూపిన మానవత్వానికి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఆదుకున్న ఆయనకు గ్రామం ఎప్పటికీ రుణపడి ఉంటుందని టేకులతండా వాసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోతు శివలాల్, ఉప సర్పంచ్ హాసిలి వీరన్న, గ్రామ అధ్యక్షుడు వాసు నాయక్, వార్డు సభ్యులు శంకర్, విజయ్, నవీన్, రవీందర్, అశోక్‌తో పాటు స్వామి, కుమార్, చిరంజీవి, కిషన్, వెంకన్న, ధర్మ, రవికుమార్, చందూలాల్, తదితరులు పాల్గొన్నారు.



## దడగల రవి పుట్టినరోజు వేడుకలు

**టీ మీడియా, జూన్ 15 ,కురవి:** కురవి మండల కేంద్రంలో కురవి బిఆర్ఎస్ పార్టీగ్రామ సోషల్ మీడియా ప్రతినిధి దడిగల రవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి వారి మిత్రులు శాలువాతో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జే (ఐ జే యు ) జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ జిల్లా దాడుల కో కన్వీనర్ బేతమల్ల సహదేవ్ బిఆర్ఎస్ నాయకులు నూతక్కి సాంబశివరావు,బి ఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు కొనతం విజయ్ తెలంగాణ ఉద్యమకారులు పేర్ల గణేష్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఇరుగు వెంకన్న, వార్డు సభ్యులు రాగం వీరభద్రం, తేజ వత్ ప్రమోద్,గండమాల రోశయ్య, పొన్నెబోయిన వెంకన్న, మిరియాల శ్రీనివాస్, దడిగల నరసయ్య తదితరులు పాల్గొని రవి కి శుభాకాంక్షలు తెలియజేశారు.




## తోటకూరి రాంబాబుకు ఘన సన్మానం

**టీ మీడియా,జూన్15,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన తోటకూరి రాంబాబును కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు.కారేపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు రాంబాబుకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బానోత్ రాంమూర్తి,సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రంజిత్ కుమార్,సర్పంచులు మేదరి వీర ప్రతాప్ (టోనీ),భూనోత్ హీరాలాల్,ఇస్లావత్ రాజు,వాంకుడోత్ హన్మంతరావు,భూక్య బాలు,ఈసం మోతీరస్వామి,ఉండం రాఘవులు,బానోత్ పద్మ వీరభద్రం,కాంగ్రెస్ నాయకులు అడ్డగోడ ఐలయ్య,సూరపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి,సురేందర్ మనియార్,ఎండీ.యాకూబ్ అలీ,బోళ్ల రమేష్,షఫీ,పిట్టల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్యారేజీ కార్మికులపై పని భారం తగ్గించాలి

### రాష్ట్ర సదస్సులో వి.ఎస్.రావు, లింగమూర్తి




**టీ మీడియా ,జూన్ 15, ఖమ్మం** :గ్యారేజీలో అన్ని ఖాళీలను భర్తీ చేసి, పని భారం తగ్గించి భద్రత కల్పించాలని గ్యారేజీ కార్మికుల రాష్ట్ర సదస్సులోస్టాఫ్ ఒ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు, లింగమూర్తి లు డిమాండ్ చేసారు. ఖమ్మంలోనే స్థానిక సీఐటీయు ఆఫీసు నందు కామ్రేడ్ పిట్టల సుధాకర్ అధ్యక్షతన జరిగిన గ్యారేజ్ కార్మికుల రాష్ట్ర సదస్సులో గ్యారేజీ కార్మికులు వివిధ డిపోల నుండి పాల్గొన్నారు .సదస్సు ఉద్దేశించి వి ఎస్ రావు మాట్లాడుతూ సమ్మెకు ముందు సమ్మె తర్వాత పరిణామాలు వివరించారు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ అనేక సమస్యలను కార్మికుల దృష్టికి తీసుకొస్తూ, వివిధ రూపాలలో ఆందోళన చేసిందన్నారు.కార్మికులపై భారాలు తగ్గించాలని, యూనియన్ల పై ఆంక్షలు ఎత్తివేయాలని, విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేయాలని సదస్సులు జరిపి సంస్థకు, కార్మికులకు వచ్చే ప్రమాదం వివరించిందన్నారు. హయ్యర్ పెన్షన్ పై ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయటం,మహాలక్ష్మి స్కీము వల్ల వస్తున్నటు వంటి ఇబ్బందులు పై సెమినార్ పెట్టి రిప్రజెంటేషన్ చేయటం, లేబర్ కోడ్స్ పై విస్తృతంగా కార్మికుల్లో చర్చ జరిపి వాటి వల్ల ప్రమాదం ఏ రూపంలో ఉంటుందో బుక్లెట్స్ వేసి దానిపై సమ్మె చేయటం జరిగిందన్నారు. జూనియర్ క్లర్క్ ఎగ్జామ్ కు డ్రైవర్లకు, గ్యారేజీ సిబ్బందికి అవకాశం ఇవ్వాలని ఎస్డబ్ల్యుఎఫ్ రిప్రజెంటేషన్ మేరకు అవకాశం రాగా ఎగ్జామ్లో క్వాలిఫై కోసం అనేక సెంటర్లో అవగాహన సదస్సులు పెట్టటం ఇలా ప్రతి సమస్యపై ఎస్డబ్ల్యుఎఫ్ పనిచేసింది అని తెలియజేసినారు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ స్వతంత్రంగా కృషి చేస్తూనే ఉమ్మడి సమస్యలు పై అన్ని కార్మిక సంఘాలు కల్సి పని చేసేలా కృషి చేసింది. 2026 ఏప్రిల్ లో జరిగిన సమ్మెకు మద్దతు ఇచ్చిన పిదపే అన్ని కార్మిక సంఘాలు మద్దతు తెలపటం వలనే సమ్మె విజయవంతం అయ్యింది, ఇది మొత్తం కార్మికుల విజయము అని తెలియజేసినారు.ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం అందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేసినారు . సమ్మె విరమణ సమయం లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ కోరారు.విలీన ప్రక్రియ వెంటనే మొదలుపెట్టాలని, విలీనానికి ముందు కొన్ని సమస్యలు పరిష్కారం చేయాలని ఇతర రాష్ట్రాలను అధ్యయనం చేసి బుక్లెట్స్ వేసి విస్తృతంగా కార్మికుల్లో చైతన్యపరిచి, నివేదికనే విలీన కమిటీకి ఇవ్వడం జరిగిందని అన్నారు. అలాగే ఉద్యోగ భద్రతపై కూడా పూర్తిగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వటం జరిగిందని అన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జి. లింగమూర్తి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ గతంలో ఖమ్మం రీజియన్ లో ఎస్ డబ్ల్యూ ఎఫ్ స్థానిక గుర్తింపు సంఘంగా గ్యారేజీ కార్మికులకు టూల్స్, జిప్ క్రేన్స్, ఫెడస్టల్ ఫ్యాన్స్,గ్యారేజీ కార్మికులకు టీటీ ఇంజక్షన్స్, ఎప్పటికప్పుడు టెక్నాలజీకి అనుగుణంగా టూల్స్ ఇప్పించటం జరిగిందని, ప్రతి సమస్యపై పనిచేయడం జరిగిందని తెలియజేసినారు.వివిధ డిపోల నుండి వచ్చిన గ్యారేజీ కార్మికులు రోజువారి వారి పనిలో వస్తున్నటువంటి ఇబ్బందులు, పెరిగిన పని భారాలు, వేధింపుల ను వివరించారు.అన్ని డిపోలలో మెకానికులు, శ్రామికులు, హెల్పర్స్, లీడింగ్ హ్యాండ్, మెకానికల్ ఛార్జ్ హ్యాండ్ ల తో సహా షెడ్యూల్స్ అనుగుణం గా సిబ్బంది కొరత చాలా ఉన్నది అని, విపరీత పని భారం ఉందని తెలియ చేసారు. అధ్యక్షులు పిట్టల సుధాకర్ మాట్లాడుతూ కార్మికుల కోసం నిరంతరం పని చేసే ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలోపేతం చేయాలనీ, జూన్ 18 న ఖమ్మం లో జరిగే మహిళా సదస్సు ను అలాగే జూన్ 21 న హనుమకొండ లో జరిగే డ్రైవర్స్ సదస్సు లను జయప్రదం చేయాలనీ కోరారు.ఈ సదస్సులో ఖమ్మం రీజియన్ కోశాధికారి పి. నర్సింహారావు, ఖమ్మం డిపో అధ్యక్షులు జి. వెంకటయ్య లు నిర్వహణ బాధ్యతలు చెపట్టారు.



## రైతులకు ఎరువులు,విత్తనాలు అందుబాటులో ఉంచాలి

### తహసీల్దార్‌కు రైతు సంఘం వినతి

**టీ మీడియా,జూన్15,సింగరేణి(కారేపల్లి):**ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువులు,విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.రైతుల సమస్యలపై సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో సింగరేణి మండల తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేసింది.నకిలీ విత్తనాలు,నకిలీ పురుగుమందుల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రైతు రుణమాఫీ ఇప్పటికీ సుమారు 60 శాతం మంది రైతులకు అమలు కాలేదని,బ్యాంకుల్లో రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే. నరేంద్ర,రైతు సంఘం మండల అధ్యక్షుడు ముండ్ల ఏకాంబరం,కార్యదర్శి వజ్జా రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా నిధులు రబీ సీజన్‌లో అరకొరగా మాత్రమే అందాయని,ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతు భరోసా విడుదలపై స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు.ఎరువుల ధరలు విపరీతంగా పెరగడంతో చిన్న,సన్నకారు రైతులకు వ్యవసాయం భారంగా మారిందన్నారు.రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే పోడు భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు హక్కు పత్రాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని,సాగులో ఉన్న పోడు భూములకు హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు తలారి దేవప్రకాశ్,వాసం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ

**టీ మీడియా ,జూన్ 15, కూసుమంచి:**సోమవారం మండల విద్యాధికారి, కూసుమంచి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి తమ పాఠశాల విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఉచిత పుస్తకాలు, ఉచిత ఏకరూప దుస్తులు,మధ్యాహ్న భోజన సౌకర్యాలను కల్పిస్తుందని రానున్న రోజుల్లో ఉదయం అల్పాహారం అందించడానికి కృషి చేస్తుందన్నారు. క్రమ శిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధన

### ఎంఈవో దుగ్గిరాల జయరాజు

**టీ మీడియా,జూన్15,సింగరేణి(కారేపల్లి):** ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ఆధారిత బోధన,డిజిటల్ తరగతులను నిర్వహిస్తున్నామని సింగరేణి మండల విద్యాధికారి దుగ్గిరాల జయరాజు తెలిపారు.సోమవారం మండలంలోని విశ్వనాథపల్లి హైస్కూల్,ప్రాథమిక పాఠశాల,బొక్కలతండా,కారేపల్లి పాఠశాలలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.అనంతరం ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం రాగిజావా అందిస్తున్నామని,ఉచితంగా పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ బోధనను అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ పాఠశాలల్లో మౌలిక వసతులు,డిజిటల్ సదుపాయాలు మరియు విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపడుతోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాజకీయ ప్రయోజనాలు తప్ప కార్మికుల సమస్యలు పట్టవా..

- 31 డిమాండ్లతో సింగరేణి యాజమాన్యానికి సమ్మె నోటీసు..
- ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కె.రాజ్ కుమార్

**టీ మీడియా,జూన్15, మణుగూరు**

ఐఎన్‌టియుసి, టీబీజీకేఎస్ కార్మిక సంఘాలకు రాజకీయ ప్రయోజనాల తప్ప, కార్మికుల సమస్యలు పట్టవని, ఎన్నికల కోసమే పనిచేస్తున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కొరివి రాజ్ కుమార్ అన్నారు. సోమవారం పీకే ఓసి 2లో గేట్ మీటింగ్‌లో మాట్లాడుతూ సిఐటియు మినహా అన్ని కార్మిక సంఘాలు రాజకీయ జోక్యంతో సింగరేణి సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ జూన్ 8వ తేదీన యాజమాన్యానికి 31 డిమాండ్లతో సమ్మె నోటు ఇచ్చామన్నారు. సింగరేణిలో నిలిచిపోయిన మెడికల్ బోర్డును పునరుద్ధరించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన 56 వేల కోట రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని, తదితర 31 డిమాండ్లతో యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. మణుగూరు ఏరియాలో పీకే ఓసీ 2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ బ్లాక్ సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ రాకపోతే మణుగూరుకి భవిష్యత్తు 2030 వరకే ఉండదని, సింగరేణికి కూడా ఆర్థికంగా నష్టపోవడమే కాక సింగరేణి వల్ల పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన మణుగూరు, పరిసర ప్రాంతాల ప్రజల ఉపాధి, అభివృద్ధి కుంటూ పడుతుందని అన్నారు. మణుగూరు ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వ రంగ సంస్థలైన బిటిపిఎస్, హెవీ వాటర్ ప్లాంట్, బిపిఎల్ తదితర సంస్థలు ఈ ప్రాంత బొగ్గుతోటే మనుగడ సాధిస్తున్నాయని, సింగరేణి సంస్థ బొగ్గు వెలికి తీయకపోతే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల కుటుంబాలు ఉపాధికి దూరమయ్యే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వై. రామ్ గోపాల్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, బి సురేందర్ రావు, పిట్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## అనధికారిక డంపింగ్ యార్డ్

వ్యర్థాల వద్దకు చేరుకుంటున్నాయి. ప్లాస్టిక్ కవర్లలో ఉన్న తినుబండారాలను, ఆ కవర్లతో సహా తినేస్తుండటంతో అవి తీవ్ర అనారోగ్యం పాలై మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా రాత్రి వేళల్లో పశువులు ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న హృదయవిదారక దృశ్యాలు నిత్యం దర్శనమిస్తున్నాయి.

**అధికారులు మేల్కొనేదెన్నడు?**

గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాన రహదారి పక్కన ఇంతటి తీవ్రమైన సమస్య ఉన్నప్పటికీ, పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, వర్షాకాలం రాకముందే ఈ డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా శుభ్రపరచాలి. నిబంధనలు ఉల్లంఘించి రోడ్డు పక్కన చెత్త వేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బ్లీచింగ్, ఫాగింగ్ వంటి పారిశుధ్య చర్యలు చేపట్టి ప్రజల, మూగజీవాల ప్రాణాలను కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## రూ.33 లక్షల బకాయి బిల్లు కోసం బడికి తాళం

### రోడ్డున పడ్డ విద్యార్థులు, ఉపాధ్యాయులు

**టి మీడియా ,జూన్ 15, డోర్నకల్ :**మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పెరుమండ్లసంకీస గ్రామంలో సంచలన ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని ప్రైవేట్ పాఠశాల భవన యజమాని, తనకు రావాల్సిన సుమారు రూ.33 లక్షల అద్దె బకాయిలు చెల్లించలేదని ఆరోపిస్తూ పాఠశాల ప్రధాన గేటుకు తాళం వేశారు.దీంతో సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటే నిలిచిపోయారు. తరగతులు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడటంతో విద్యార్థుల చదువులకు అంతరాయం కలిగింది.గ్రామస్తులు, తల్లిదండ్రులు ఈ వ్యవహారంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బకాయిల వివాదాన్ని యాజమాన్యం, భవన యజమాని పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టవద్దని కోరుతున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

**టిమీడీయా, జూన్16, ఏన్కూరు** :సోమవారం పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా బురద రాఘవాపురం సర్పంచ్ రాణి, ఉప సర్పంచ్ వెంకటనారాయణ , పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాగి సుజాత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులను పుష్ప గుచ్చాలతో, చాక్లెట్స్ తో పాఠశాలలోకి ఆహ్వానం పలికారు. పాఠశాలను మామిడి తోరణాలతో అలంకరించారు. విద్యార్థులందరూ మంచిగా చదువుకొని, మంచి పౌరులుగా ఎదగాలని, ఊరుకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. వెంకట నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, పుష్టికరమైన మధ్యాహ్న భోజనం పెడుతున్నారని రెండు జతల బట్టలు , నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్కులు ఇస్తున్నారని ఈ సంవత్సరం కొత్తగా ఉదయం టిఫిన్ , ప్రతి విద్యార్థికి వర్క్ బుక్కులు ఇస్తున్నారు ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాగి సుజాత, పొట్ట రామారావు, శ్రీనివాసరావు, పుల్లయ్య, నరేష్, భాస్కర్ నాగేశ్వరరావు, సులోచన, కృష్ణ, బావ్ సింగ్ లు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకోవాలి

### -అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్.

**టీ మీడియా జూన్ 15 కురవి** :మానవతా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్, పిలుపునిచ్చారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచనల మేరకు జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో) రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా జిల్లా జర్నలిస్టులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన సేవలను అందించే అవకాశముంటుందని తెలిపారు. సేవా భావం కలిగిన ప్రజలు, యువత, ఉద్యోగులు, జర్నలిస్టులు రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని పొందాలని కోరారు.కార్యక్రమంలో పలువురు సీనియర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొని సభ్యత్వ నమోదు చేసుకున్నారు.



# తహసిల్దార్ కార్యాలయం ముట్టడించిన రైతులు

**టిమీడీయా, జూన్16, ఏన్కూరు:** మండలంలో పోడు రైతుల సమస్య తీవ్రరూపం దాల్చింది. పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. మూలపోచారం, రంగాపురం, నెమలిపురి, రామ్‌నగర్ తండా గ్రామాలకు చెందిన వందలాది మంది గిరిజన రైతులు పెద్దఎత్తున తరలివచ్చి కార్యాలయాన్ని ముట్టడి చేసి ఆందోళన చేపట్టారు. సమస్యపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు అక్కడి నుంచి కదలమని బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పంట రుణాలు మాఫీ చేయాలి, గిరిజన రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో హక్కు పత్రాల ఆధారంగా తీసుకున్న పంట రుణాలను ఇప్పటికీ మాఫీ చేయకుండా బ్యాంకు అధికారులు బలవంతపు వసూళ్లు జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గిరిజన రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రుణమాఫీ చేసి కొత్త పంట రుణాలు అందించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళన సందర్భంగా రైతుల డిమాండ్ మేరకు స్థానిక తహసిల్దార్ సిహెచ్ శేషగిరిరావు తిమ్మరావుపేటలో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌తో పాటు వ్యవసాయ శాఖ మండల అధికారులను పిలిపించి, పోడు రైతులు, గిరిజన సంఘం, సిపిఎం నాయకుల సమక్షంలో సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. పది రోజుల్లో మరోసారి బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులతో తహసిల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం గిరిజన రైతులు ఆందోళనను విరమించారు. చివరగా తమ డిమాండ్లతో కూడిన



వినతిపత్రాన్ని తహసిల్దార్ సిహెచ్ శేషగిరి రావు కు సమర్పించారు. గిరిజన రైతుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సిపిఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ ధర్నాలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ బాలాజీ, సిపిఎం మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి ఏర్పుల రాములు, ఇటికాల లెనిన్, భూక్య లక్ష్మ, సాయి తదితరులు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి..

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**టి మీడియా ,జూన్ 15, ఖమ్మం:**ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామ కాంగ్రెస్ ఆర్గనైజర్ సాగుర్తి ఫిలిప్ గ్రామంలోని సర్వే నెంబర్ 188, 190, 119 లో ఎస్సీ ఎస్టీ వారు తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేస్తున్నారని, వీరికి వ్యవసాయ పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం 32వ వార్డు బొక్కల గడ్డకు చెందిన టి.ఉమా రాణి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కొణిజర్ల మండలం మల్లుపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన కె.రమేష్ బాబు తనకు సర్వే నెంబర్ 24/హెచ్/6 లో 2 ఎకరాల 31 గుంటల భూమి ఉందని సీతారాం బంజర మేజర్ కాలువ నుండి మా పొలంకి పంట కాలువ ఉందని, పై భాగంలో ఉన్న రైతులు కాలువను ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని సాగునీరు రావడం లేదని, తమకు కాలువ సౌకర్యం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కొణిజెర్ల కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం మోతీనగర్ కు చెందిన కే.వెంకట కృష్ణ తమ ఇంటికి మిషన్ భగీరథ పైప్ లైన్, రోడ్డు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.సింగరేణి మండలం బొక్కలతండా గ్రామానికి చెందిన ఏ. రామారావు తన ఇంటి



స్థలంలో 2 విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వీటి వల్ల ఇంటినిర్మాణానికి ఆటంకం కల్గుతున్నందున ఆ స్తంభాలు తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్ఈ టిజి ఎన్పిడిసిఎల్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.

**టీ మీడియా, జూన్ 15 ,కురవి** :సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో కలిసి వన మహోత్సవం కార్యక్రమం నిర్వహణ, రానున్న వర్షాకాలం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై యాక్షన్ ప్లాన్ సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పరిశుభ్రత తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి క్షేత్రస్థాయిలో అమలు చేయడం జరుగుతుందన్నారు., 43.5 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు, జిల్లాలోని నర్సరీలలో డిమాండ్ కనుగుణంగా మొక్కలను పెంచాలని సూచించారు, అటవీ,మున్సిపల్, గ్రామీణ ప్రాంతాలలో మంకీ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయాలని అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, నాటిన మొక్కల పెంపకం సంరక్షణలో తగిన జాగ్రత్తలు వహించాలని ఎవెన్యూ ప్లాంటేషన్, మంకీ ఫుడ్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సబ్ సెంటర్స్ లలో మందులు సిద్ధంగా



ఉంచుకోవాలన్నారు, పంచాయతీరాజ్, మున్సిపల్ పరిధిలలో సానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, అంటువ్యాధులు, విష జ్వరాల నివారణ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, అందుకోసం కరపత్రాలు లోకల్ సామాజిక మాధ్యమాలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలియపరచాలన్నారు .ప్రత్యేకించి అన్ని వసతి గృహాలు ,ప్రభుత్వ పాఠశాలలు ఇతర విద్యాసంస్థలలో స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యాసంస్థలలో పనిచేసే సిబ్బంది ,పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి విశాల్ బత్తుల, అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె.అనిల్ కుమార్, ఇన్చార్జి స్థానిక సంస్థలు, హౌసింగ్ పిడి, పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు సంబంధిత సిబ్బంది కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో

ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎండల ప్రభావం వల్ల కార్మికులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం గురించి మరింత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఎక్కువ మంది పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మాస్టర్ కార్డులను పరిశీలించిన కలెక్టర్, పని దినాల నమోదు, హాజరు వివరాలు, చెల్లింపుల స్థితిగతులపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో ఉపాధి హామీ పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు మహిళా సంఘ భవనాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎంపీడీవోలు పనుల అమలు, పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అధిక సంఖ్యలో కార్మికులను సమీకరించి పనులు నిర్వహిస్తే అదనపు కాంపోనెంట్ నిధులు పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్మికులు చేసిన పనికి సంబంధించిన వేతన వివరాలను అదే రోజున వారికి స్పష్టంగా తెలియజేయాలని, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, వ్యవసాయ మౌలిక సదుపాయాల బలోపేతంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీలలో కొనిజర్ల తహసీల్దార్ అరుణ, ఎంపీడీవో ఉపేంద్రయ్య, సర్పంచ్ గుదే పుష్పావతి, వైరా తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో సక్రు నాయక్, లక్ష్మీపురం సర్పంచ్ నూతి వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు సత్వర సేవలందించడమే లక్ష్యం

**ప్రజావాణిలో అందిన కొన్ని వినతులు**

టేకులపల్లి మండలం మొక్కంపాడు తండాకు చెందిన భూక్య సుమన్ తాను జన్మతః దివ్యాంగుడినని, అద్దె ఇంటిలో నివసిస్తూ జీవనం సాగించడం కష్టతరంగా మారిందని, ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తదుపరి చర్యల కోసం గృహ నిర్మాణ శాఖ పీడీకి ఎండార్స్ చేశారు. మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన బట్ట కృష్ణవేణి తన కుమార్తె దివ్యశ్రీ ఆరో తరగతి ప్రవేశం కోసం గురుకుల ప్రవేశ పరీక్ష రాసినప్పటికీ సీటు రాలేదని, తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ప్రైవేట్ పాఠశాలలో చదివించే స్థోమత లేదని పేర్కొంటూ గురుకుల పాఠశాలలో సీటు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. దీనిపై తగు చర్యల కోసం ఆర్‌సీఓ, సోషల్ వెల్ఫేర్‌కు ఎండార్స్ చేశారు. సుజాతనగర్ మండలం చిమ్మ తండా గ్రామానికి చెందిన భూక్య సేవ తన తండ్రి 2010లో మరణించారని, మరణ ధ్రువీకరణ పత్రం కోసం పలుమార్లు మీ సేవలో దరఖాస్తు చేసినప్పటికీ తిరస్కరణకు గురవుతోందని తెలిపారు. ఈ కారణంగా తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరుపై మార్చుకోలేకపోతున్నానని, సమస్య పరిష్కరించి మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల కోసం సుజాతనగర్ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన స్వప్న తనకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, పూర్తిగా వర్షాధార సాగుపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నానని, బోరు మరియు విద్యుత్ సదుపాయం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ తదుపరి చర్యల కోసం ఐటీడీఏ పీవోకు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం ధనియాలపాడు గ్రామ పరిధిలోని బాలాజీ తండాకు చెందిన భానోత్ అనూష తనకు సంబంధించిన రెండు వేర్వేరు భూముల భూభారతి రిజిస్ట్రేషన్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం సంబంధిత ధరణి అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి' కి ప్రథమ ప్రాధాన్యత

**-జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**టీ మీడియా .జూన్ 15, కురవి :** జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికే 'ప్రజావాణి' కార్యక్రమానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పురుషోత్తం లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని అధికారులు అత్యంత బాధ్యతగా స్వీకరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, చట్ట నిబంధనల ప్రకారం అర్హులకు తక్షణమే న్యాయం చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలను శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని, మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎక్కడా రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు ప్రధానంగా భూ సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ పథకం మరియు స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీ సమస్యలపై కలెక్టర్కు వినతి పత్రాలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం ( 215 ) దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల వారీగా కంప్యూటరైజ్ చేసి, సంబంధిత అధికారులకు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు. నిర్ణీత కాలవ్యవధిలోగా వీటికి పరిష్కారం చూపి, నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలని, దరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) అదనపు కలెక్టర్ ఇంచార్జ్ స్థానిక సంస్థల పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, అన్ని విభాగాల అధికారులు, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# బయో ఫ్లాక్ ద్వారా చేపలు అధిక దిగుబడి



**టీ మీడియా, జూన్ 15,కూసుమంచి:** శాస్త్రీయ పద్ధతిలో బయో ఫ్లాక్ విధానం ద్వారా చేపలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించ వచ్చని సిరిసిల్ల జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు చొప్పరి రామచంద్రం పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రం పాలేరు మత్స్య పరిశోధన కేంద్రంలో బయో ఫ్లాక్ విధానం ద్వారా చేపల పెంపకం, నైపుణ్యాభివృద్ధి అంశం పై 3 రోజుల పాటు జరుగనున్న శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధానం లో తక్కువ విస్తీర్ణం గల తక్కువ నీటి వినియోగం తో అధిక మొత్తంగా చేపల సాగు చేస్తే అధిక లాభాలు పొందేందుకు దోహద పడుతుందని ఆయన అన్నారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్ట్, అధిపతి, శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ నాబోర్డు బ్యాంకు ఆర్థిక సహకారం తో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం మొత్తంగా ప్రతి ఒక్కరు బయోఫ్లాక్ పద్ధతిలో చేపలు సాగు చేసి ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని ఆయన సూచించారు. తక్కువ విస్తీర్ణం భూమి గల చిన్న సన్న కారు రైతులకు ఈ విధానం అత్యంత ఉపయోగకరమని, తక్కువ కాలంలో ఎక్కువ రాబడులు పొందేందుకు ఉపయోగకరమని ఆయన సవివరంగా చెప్పారు. , ప్రస్తుతం శిక్షణ పొందిన వారంతా ఆచరణ పెట్టి ఆధునిక పద్ధతి చేపల సాగు తో ఆర్థిక పరిపుష్టి సాధిస్తారని శ్యాం ప్రసాద్ ఆకాంక్షించారు. ప్రొఫెషనల్ కుమారి బానోత్ దివ్య మాట్లాడుతూ చేపలు అధిక దిగుబడి కి ఉపకరించు సూక్ష్మజీవుల సంఖ్యను అధికం చేసేందుకు వాటికి గోధుమ పిండి బెల్లం మొలాసిస్ మొక్కజొన్న పిండి పదార్థాలను ఆహారంగా అందించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో చేపల సాగు స్థితిగతులపై దివ్య సవివరంగా చెప్పారు. మత్స్య శాస్త్రవేత్త బానోత్ రవీందర్ మాట్లాడుతూ బయో ఫ్లాక్ విధానంలో కంచదగిన చేపల రకాల గురించి ఆయన వివరించారు. ఆధునిక పద్ధతిలో బయోఫ్లాక్ విధానం ద్వారా చేపల సాగు ఎంతో ఉపయోగకరమని అన్నారు. మత్స్య శాస్త్రవేత్త శాంతన్న మాట్లాడుతూ బయోఫ్లాక్ విధాన చేపల సాగుకు అవసరమైన అనుకూల స్థలం ఎంపిక ట్యాంకుల నిర్మాణం వసతులు తార్పాలిన్ షీట్ ఏర్పాటు, పి వి సి పైపుల నిర్మాణం జనరేటర్ ఏర్పాటు గాలి పైపుల అమరిక తో పాటు నిర్మాణం కు అవసరమైన పలు వాటి గురించి సవివరంగా చెప్పారు. ఈ శిక్షణలో నాగర్ కర్నూల రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట ఖమ్మం జిల్లా లోని వివిధ మండలాలకు చెందిన మొత్తం 25 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట బ్లాక్ టెక్నాలజీ ఆత్మ మేనేజర్ జి శ్రీనివాసరావు తో పాటు పలువురు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవనం కు ఆర్థిక సహాయం

**మాలోతు నెహ్రూ నాయక్ 25వేలు**




**టీమీడియా, జూన్16, కురవి:** కురవి మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం పునరుద్ధరణ పనుల కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాలోత్ నెహ్రూ నాయక్ తన వంతు సహాయంగా రూ. 25 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాలోత్ నెహ్రూ నాయక్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను భావితరాలకు చేరవేయడంలో అంబేద్కర్ భవనాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కురవి మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం శిథిలావస్థలో ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. భవనం పునరుద్ధరణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ, సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కురవి మాజీ సర్పంచ్ బానోత్ తుకారం నాయక్, ప్రధాన కార్యదర్శి ఆవిరే మోహన్ రావు, యూత్ అధ్యక్షులు శరత్, నాయకులు బానోత్ లక్ష్మణ్, శ్యామల శ్రీనివాస్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత, దళితరత్న, వార్డు సభ్యులు దైదా భద్రయ్య, మాజీ వార్డు సభ్యులు ఇరుగు వెంకన్న, కిన్నెర మల్లయ్య, బొల్లం ఉప్పలయ్య, పిడమర్తి రమణయ్య, ఇరుగు నాగరాజు, మేడి శ్రీనివాస్, కందిపాటి వెంకన్న, బత్తుల వీరన్న, చింతపల్లి ముత్తులింగం నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.